


# దండయాత్ర

మద్రాసు సెంట్రల్ రైల్వేస్టేషనులోని రెండోనెంబరు ప్లాటుఫారం మీద నిలచి సాహసంతో కుడికాలు ఎత్తిన వరహాలరాజు ధైర్యంగా, ధీమాగా గాఠిగా ఆ కాలును నేలమీద మోపాడు. నేలకీ, అరికాలికీ మధ్య ఒకానొక బలసిన కొండ అరటిపండు తాలూకు దళసరి తొక్క ఉండడం వల్ల, ధైర్యంగా, ధీమాగా రెండో అడుగు వేయబోయిన రాజు ప్రయత్నానికి ద్వితీయవిఘ్నం లాటిది వాటిల్లింది. అయినా, ఆ ప్రయత్నం అవసరం లేకుండా ఆ కుడికాలు మీదనే ఎక్కి అతడు చాలా అర్జెంటుగా ఐదారు గజాల దూరం వెళ్ళిపోయాడు, పెట్టిసహా. ఆ స్పీడుని అలాగే ఉండనిస్తే క్షణకాలంలో బస్సు అవసరంకూడా లేకుండా కోడంబాక్కం చేరుకునేవాడే గాని, మధ్యలో ఒకాయన తెలిసినట్టు కనబడడంతో ఆయన భుజం పట్టుకుని హలో అని ఆగాడు. ఆయన బొద్దుగా ఉన్నందువల్ల ఇతడే

బోల్తాబడిలేచి, సారీ అని ఆ మొహం చూచి అట్టె ఆశ్చర్యపడి మళ్ళీలేచి, హాయ్య బాబోయ్ అన్నాడు.

ఎదుటి మనిషి విస్తుపోయాడు. "సార్ .... మీరు .... యు .... ఐయామ్ ఎసినిమా .... ఆవాళ్ళరోజునే .... యీ .... మీ...." అన్నాడు రాజు కర్త కర్మ క్రియలను వరుస ప్రకారం పేర్చి ఖాళీలు భర్తీ చెయ్యడం వాయిదా వేసి!

"వాట్ సార్....వాటయు....వాట్ మీ ? యూరినీ ? ఎన్నా ఇదెల్లాం ?" అన్నాడు లావుపాటి ఆసామి చిరాకులోనే కాస్త జాలి రంగరించి.

"నో సార్....యూ ఆరెస్టైట్.... అయామే టికట్ .... మీరు .... ఆవేళరాత్రి సినిమాలోంచి ఊడిపోయారు కదండీ.

....అప్పుడు మేమందరం మళ్ళీ మిమ్మల్ని ఎక్కించెయ్యలేదు ?.... నేను మీకు తెలీదూ....సన్మానం చేస్తానన్నాడు కూడా మావాడూ."

''యన్నయ! ముతాళ్ మాదిరి .... ఎన్న ఊద్రది.'' అన్నాడు ఎల్. ఆసామి.

''ఏం చేస్తాం. మీరు కోస్తున్నారు నన్ను ఎరగనట్టు. మీరు మహానటులనుకోండి. స్వామీ ఆవేళే అడుగుదామనుకున్నా మీతో కలిసి తెరలోకి అప్పుడే ఎక్కిపోనా అని....పోనీ ఊపూరొచ్చి అడగొచ్చుకదా.... అనుకుంటే. ఏం చేస్తాం మీరు కోస్తున్నారు నన్ను ఎరగనట్టు!'' అని దిగులుగా ప్రాధేయపూర్వకంగా చూశాడు రాజు. అతనికి భయం వేసింది. ఎదటిమొహాన్ని చూసి, ఏం తోచక పాతపాట పల్లవినే పట్టుకు పుంజు కున్నాడు గాడిచెడిన గ్రామఫోనులా. ''ఏం చేస్తాం....మీరు కోస్తున్నారు నన్నెరగనట్లు ఇంకేం చేస్తాం మీరు కోస్తున్నారు .... ....'' ఇలా పల్లవిని కొంతసేపు ఆలపించే సరికి కొండంటి ఎదటిమనిషి మంచల్లె కరిగి మాయమైపోయాడు.

"హమ్మయ్య'' అనుకుని రాజు మళ్ళీ ముందడుగు వేశాడు........ అలా అడుగులు వేస్తున్నాడు. కాని అతని బుర్రలో ఇందాకటి రైలు పరుగెడుతోంది. మూడ్రోలు క్రితం చూసిన సినిమా, ఇంకోమూల మ్యాటనీలా ఆడుతోంది. బైరాగి, లావుపాటి ఆసామీ కూడా కాస్త చోటు చేసుకుని డైలాగులు చెబుతున్నారు. ఇలా నుదురుమీద ఇవన్నీ తిరిగితే సూపర్ ఇంపోజ్ షాటు అంటారని జ్ఞాపకం వచ్చింది అతనికి. ఆనక, తెలుగు సినిమాలోని నేపథ్యపుపాట ఓటి మననం చేసుకుంటూ, కొంత దూరం సాగిపోయాడు.

అతని చేతిలో పెట్టి, 'బస్సెక్కు బ్రదర్ ఎంతసేపు మోస్తావు?' అంది.

'మరే నువ్వు నాదానివికూడా కావు' అన్న రిప్లయిడైలాగు కూడా అనుకుని, ఒక వడివేలు నడిగి బస్సెక్కి పాండి బజారులో దిగాడు ....

పూటుగా గాలిపీల్చి హమ్మయ్య ఈ లోకంలో పడ్డాం అనుకున్నాడు సంతోషంగా.

"మెడ్రాసులో ఎవర్నీ నమ్మకు. మూర్ మార్కెటుకి వెళ్ళకు, అరవం నేర్చుకో, ధైర్యంగా ఉండు డబాయించి బ్రతుకు" అని తన నేస్తం ముత్తెం చెప్పిన మాటలు అతనికి ఆకాశంలోంచి ముందర మెల్లిగా, ఆనక కొంచెం గట్టిగా, తరువాత ఇంకా గట్టిగా వినిపించాయి.

"అబ్బ ఉండవోయి కాఫీ తాగాలి'' అని విసుక్కొని, ఆపనిచేశాడు. ఆనక గుట్టు చెప్పకుండానే ఒక పత్రిక ఎడ్రసు కనుక్కొని అక్కడకు వెళ్ళాడు.

ఒకాయన తలవంచుకు రాసుకుంటున్నాడు ఒక గదిలో.

'డబాయించి బతుకు' అని ముత్యం మళ్ళీ చెప్పాడు నేపథ్యంలోంచి.

"ఏమండీ నాగేశ్వర్రావిక్కడ?'' అన్నాడు గడపమీద నించుని గంభీరంగా.

"ఏ నాగేశ్వర్రావండీ?''

"ఇంకే నాగేశ్వర్రావు. ఆ నాగేశ్వర్రావే" అన్నాడు రాజా ఇంకా గంభీరంగా.

"ఇక్కడ ఆ. నాగేశ్వర్రావు అని ఎవరూలేరు. అ. నాగేశ్వరరావు, ఆర్. నాగేశ్వరరావూ ఉన్నారు."

"తెలుసు" అన్నాడు రాజా టెక్కుగా.

"ఎవరు తెలుసు?"

"ఆ నాగేశ్వరరావు లిద్దరూ తెలుసు."

"మళ్ళీ అదేమాటా? ఇక్కడ అ. వారూ, ఆర్. వారూ ఉన్నారంటే—" అన్నాడు పత్రికలో ఆయన కొంటెగా.

"అదేనండీ నేనడిగేది. మొదటాయన సంగతి.''

"ఓహో ఆయనా? అలా చెప్పరాదూ. ఏం గిరాకి?"

"పనుంది."

"ఎడ్రసు తెలీకుండా ఎలావచ్చారు?"

"పాఠకుల ప్రశ్నల్లో అడిగితే, 1953 ఏప్రిల్ 15వ తేదీ దాంట్లో ఉందని వాళ్ళెవరో జవాబిచ్చారు. అయినా ఎడ్రసు తెలుసనుకో .... ఇక్కణ్ణించి వెళ్ళేదారి కావాలి".

''వెనక్కి తిరిగితే వెళ్ళొచ్చు వీధిలోకి."

రాజుకీ ధోరణి లాభం లేదనిపించింది.

"అయ్యా ఎడిటర్జీ, మీరు యాంధ్రులు నేనూ ఆంధ్రుడినే. నన్ను మీరు పైకితీసుకు రావాలి. నవయువకులను పైకితేవటం మీ బాధ్యతగదాండి. అది కుదరకపోతే రామారావిల్లేనా, నాగేశ్వర్రావిల్లేనా ఎక్కడున్నాయో చెప్పండి." అన్నాడు గబగబ.

"అలాగే చెబుతాను. వాళ్ళు తెలుసా."

"ఓ! మావూరు వచ్చినప్పుడు మా డ్రామెటిక్కు సంఘం సెక్రటరీగా నేను దండవేశానుకూడా. వాళ్ళకి బాగా తెలుసు."

"ఇంకేం భేషు. అయితే స్టుడియో కెళ్ళండి తిన్నగా. ఈవేళప్పుడు అక్కడే వుంటారు."

"సరేండి ... ఈ పెట్టె, సంచీ ఇక్కడ పెట్టి వెళ్తానండి .... కాస్త దయుంచి."

పత్రిక ఎడిటర్‌కి జాలేసింది. మొహం కడుక్కోమని చెప్పి, కాఫీ తెప్పించి ఇచ్చి, వెళ్ళిరమ్మన్నాడు.

రాజు రోడ్డున పడిపోతూ సంతోషించాడు. 'ము త్తెంగాడికి ఏం తెలీదు. మరీ డబాయిస్తే అర్ధణాకి చెల్లం .... .... అంతా ట్రిక్కులుగా మాట్లాడి యాక్షను చెయ్యాలి'. అనుకున్నాడు.

పోగా పోగా గేటు వచ్చింది. అల్లంత దూరాన చూస్తూనే జాగ్రత్త పడ్డాడు రాజు. మహామహా కార్లకే దిక్కులేనట్టుంది. వరసగా ఆగి ఉన్నాయి.

మహానటులు కావలసిన బోల్డుమంది, ముందస్తుగా ఈ గేటుదగ్గిర గూర్ఖావాడి మూలంగా 'గేటుక్రాషింగు' చెయ్యలేక ఇంటి కొచ్చేశారుట. గూర్ఖావాడికి చాలా అధికారాలుంటాయి. ఎవడేనాసరే వాడు వద్దంటే

ఆగిపోవల్సిందే. లేకపోతే లాఠీతో తోసేస్తాడు. ఇంకా మాటాడితే బాకుతీసి చూపిస్తాడుట.

ఇక్కడ డబాయించి లాభంలేదు. ట్రిక్కులు అంతకన్నా లాభంలేదు.

అందుకని ఒక వారనించి ఒడుపుగా కార్లు తప్పించుకుంటూ గేటుకు దగ్గరగా వెళ్ళబోయాడు. గాని ఐదారు గజాల ఇవతలే గూర్కావాడు యముడిలా నిల్చున్నాడు.

హారినీ. గేటివతల కూడానా. అని ఆశ్చర్యపడ్డాడు రాజు. తక్షణం జేబులోంచి రూపాయినోటు తీసి గుట్టుగా గుప్పిట పెట్టుకుని, వాడిదగ్గర తక్కున ఆగిపోయి "తూ ఘూర్కాహైఁ, మై ఆద్మీహూం" అనేశాడు.

"జీహా" అన్నాడు గూర్కా కొంచెం ఆశ్చర్యంగా.

తక్షణం రూపాయి తీసి వాడి గుప్పిట్లో పెట్టేసి గబ గబా ముందరి కెళ్ళిపోయి తక్కున ఆగి, అర్జెంటుగా వెనక్కి పరుగెట్టుకొచ్చాడు రాజు: "హారినీ ఇది రైలుగేటు" అనుకుంటూ.

ఆశ్చర్యపడ్డ గూర్ఖా విగ్రహంలా నిల్చున్నాడు ఆశ్చర్యపడ్డ గూర్ఖా. అతడి చేతిలో రెపరెపలాడుతున్న పాతరూపాయి నోటు చైతన్యం వల్ల ఆ శాల్తీ, పోతపోసిన విగ్రహమే అన్న భ్రమ నురింత బలపడింది రాజుకు.

'రూపాయి నాదేగాని గూర్ఖా వీడు కాడు కాబోలు — వీడు విగ్రహం బొమ్మ' అనుకున్నాడు రాజు. రూపాయి తీసుకోడానికి మనసొప్పలేదు. మరీ నోరూ వాయీలేని బొమ్మచేతిలో రూపాయి చెక్కెయ్యడం బొత్తిగా ఇది అనిపించింది.

ఆ పక్కనే ఉన్న ఒకాయన్ని పలకరించి 'అయ్యా! ఇక్కడ ఆశ్చర్యపడ్డ గూర్ఖాగారు ఒకాయన ఉండాలి మీరుగాని చూశారా?' అన్నాడు.

''అదేవిటయ్యా అలా అడుగుతావు. ఎదురుగుంటా పోతపోసిన బొమ్మల్లె ఉండగా'' అన్నాడు ఆయన.

''మరేండి అదే చూస్తున్నా. ఇది పోత పోసిన బొమ్మగదా అని. అసలు గూర్ఖా కావాలండి.'' అన్నాడు రాజు కొంచెం సందేహంగా: బొమ్మలా ఉన్న గూర్ఖావంక ఓరకంట చూస్తూ. అప్పుడు గూర్ఖాలా ఉన్న బొమ్మ కదిలినట్టనిపించింది.

"హారినీ. వీరినే ఇందాక నేను పలకరించింది? వీరు బొమ్మలు కాదన్నమాట. ఆశ్చర్యపడ్డ నిజం గూర్ఖాలే'' అంటూ వరహాల రాజు ఒకడుగు ముందుకు వేశాడు. ఓ క్షణం ఆలోచించి అటూ, ఇటూ చూసి, ఆ బొమ్మలాఉన్న గూర్ఖా చేతిలో రూపాయినోటు గబుక్కున లాక్కున్నాడు 'ఇది నాది' అంటూ.

అంతలోకీ ఒకడుగు అసింటా ఉన్న ఒకడు, ఒకడుగు ముందుకు వేసి "ఏయ్ మిష్టర్! ఏందయ్యా ఆపని" అని రాజు చెయ్యి పట్టుకున్నాడు.

"య్యాయ్యాస్సార్. నోసార్. గుర్ఖా ఈజెరుపీసార్. ఆయిమే గేట్ సార్....ది .... దిసీజె బోల్తాసార్ .... అయమె బోయ్....నేను, మాది మావూరు లెండి. ఈగేటు చూసి అసలు గేటనుకుని వీరికి డౌరీ ఇచ్చానండి ....అదే బ్రెబు....నాది నేననుకుని."

"ఓహో అట్టనా విషయం....ఏమ్రా నిండా అవసరంగా ఉండాడు వీడు అని చూ స్తిని....ఈ గూర్ఖా అట్టనే బొమ్మె మాదిరి ఉండాడే ....వీడు దొంగ పిల్లకాయ మాదిరి వాడి పక్కలో నిల్చుకున్నాడే .... ఏమ్రాకతా, అని యోచన చే స్తినీ....అద్దానె బ్రదర్, ఈ కిల్లాడి పిల్లకాయలతో నిండా తొందురు వా పోచి........అప్పుడు ఈ నోటు నీది దానె....వీనికి బైస్రిబు

ఇస్తివా?....యేమి ఇదిదా స్టుడియో గేటు అని ఎంచుకున్నావా .... హాదరామా .... సరియాన వేలె .... అడః ఎన్నబా అమాదిరి కన్నులో చూస్తావే...." అన్నాడు ఆ ఒకడు.

"సార్. మీరు చెప్పేది తెలీలేదండి. వెరీ డిఫికల్టు. వెళ్ళొస్తా. గేటు తీశారు....వస్తానండి గూర్ఖాగారూ! క్షమించండి." అంటూ హడా వుడిగా వెళ్ళిపోయాడు రాజు.

పదడుగులు వేసేవరకు ఇందాకటాయన ఆదరా బాదరా వచ్చి కలుసుకున్నాడు.

"ఏవండి మిష్టర్" అన్నాడు.

"అరె మీకు తెలుగొచ్చునే" అన్నాడు. రాజు ఆశ్చర్యపోయి మళ్ళీ వచ్చి.

"నాకు అన్నిభాషలూ వచ్చును. ఇందాక "ఊరికే రానట్టు మాట్లాడాను సరేగాని ఎందాకా?" అన్నాడు.

"గేటుదాకా"

"ఏగేటు?"

"అదే."

"ఓ....నీపేరు."

"వి. రాజు. నీది?"

"టమిల్ కంపెనీలో అయితే రామనాధన్. తెలుగు వాళ్ళ దగ్గిర రామనాధం."

'ఎందుకూ అలా?'

"అంతా వుందిలే—గాని నీకు గేటవతల ఎవరు తెలుసు?"

"చాలామంది. నాగిరెడ్డి అండ్ చక్రపాణి, బి. యన్, కె. వి. (బి. ఎస్. సి, హాన్స్), నాగయ్య ఇంకా చాలామంది తెలుసు?"

మనిషి నవ్వాడు.

"బాబూ మందేవూరన్నావు?"

"ఏవూరూ అనలేదే?"

"ఏదైతేనేం గాని కోతలు కొయ్యడం ఇలాకాదు. నే చెబుతాపట్టు కావాలంటే .... పూర్వం నేను దిలీప్‌కుమారూ కలిసి ఓ గదిలో అద్దెకున్నప్పుడు ఇలాగే తెలీక—"

"సార్! మీరూ దిలీప్‌కుమారూ కలిసి ఓ గదిలో అద్దెకున్నారా! అయ్య బాబోయ్ నిజమే?" అన్నాడు రాజు.

"ఏం అందులో ఆశ్చర్యం ఏముంది? .... నేనూ అతనూ ఓ కంచంలో తిని ఒక మంచంలో పడుకొని"

"రెండేడి ఉండేసి కావా"

"అప్పు డెక్కడుండేవిలే .... గాని .... అలా మేం ఉండగా, ఇంకో ఫ్రెండొచ్చి, సార్ మీరు మాయింటికి వచ్చి నా కంచంలో తినాలని బతిమాలాడు నన్ను. సరేనని బిచాణా ఎత్తేశాను. అక్కడికీ దిలీప్ భయ్యా వద్దయ్యా అంటూనే ఉన్నాడు. నేను విన్నాను కాదు. తీరా వెళ్లాళ్ళయ్యేసరికి అతను గబుక్కుని గొప్పవాడైపోయి అటెళ్ళిపోయాడు. నేను ఇటొచ్చేశాను. అంతేగా."

"మరి ఇపుడెళ్తే మాటాడ్తా అండి?" అన్నాడు రాజు గజ గజ వణకిపోతూ.

"ఎందుకు మాట్లాడు .... నేనంటే ఎంతో గౌరవం. కావలిస్తే నీకు ఛాన్సిప్పిస్తా కాని .... వణికి పోతున్నావెందుకు?"

'భయభక్తుల మూలాన్నండి.'

'నామీదే? అయ్యబాబోయ్!' అన్నాడు పక్కాయన.

'కాదు మరీ. సాక్షాత్తూ దిలీప్‌కుమార్ నేస్తాలు మీరు! ఒక్కసారి ముట్టుకోనిస్తారు?'

'కానీ, నిన్ను నిరుత్సాహ పరచడం అంటే ఇష్టంలేదు నాకు.' అని చూపుడు వేలు జాచాడు రామనాధం.

ధనాధన ధనాధనమంటూ ఎలక్ట్రిక్ రైలు వెళ్ళిపోయింది.

తుళ్ళిపడి మేలుకుని కళ్ళునులుపుకున్నాడు రైలు గేటుకు చేరబడ్డ రాజు.